క్లుప్తంగా

పామాయిల్ మొక్కల సాగుపై అవగాహన



రైతులకు అవగాహన ఇస్తున్న జీఎం ప్రసాద్

నింద్ర: మండలంలోని రైతులకు పామాయిల్ మొక్కల సాగుపై అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నింద్ర, కర్పరవేడు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా 3ఎఫ్ పామాయిల్ జీఎం ప్రసాద్ మాట్లాడుతూ రైతులు పామాయిల్ సాగు చేయడంతో అధిక దిగుబడి, లాభాలు పొందవచ్చునని అన్నారు. ఇప్పటికే మండలంలో పలువురు రైతులు 30 హెక్టార్లలో పంట సాగు చేస్తున్నారన్నారు. రైతులకు మద్దతుధర లభిస్తుందని అన్నారు. మొక్కలు పెంచడానికి కావాల్సిన సదుపాయాలను కంపెనీ కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి తులసీరాం, 3ఎఫ్ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో ఆలపాకం

విజయపురం: మండల పరిధిలోని ఆలపాకం పంచాయతీ శనివారం రాత్రి 3గంటల నుంచి ఆదివారం రాత్రి వరకు అంధకారంలో మగ్గుతోంది. విద్యుత్ సరఫరా రాకపోవడంతో ఆ గ్రామాల్లో ప్రజలు అంధకారంలో ఉండిపోయారు. విద్యుత్ సరఫరా నిలిచి 24 గంటలైనా అధికారులు ఏ మాత్రం పట్టించుకోలేదు. గర్భిణీలు పిల్లలు, వృద్ధులు సైతం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయపురం మండల ట్రాన్స్‌కో ఏఈ ఇటీవల ప్రయోషన్‌పై కార్వేటినగరం వెళ్లడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. లైన్‌మెన్‌లు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని, ఫోన్ చేసినా స్పందించడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

కాణిపాక వరసిద్ధునికి విరాళాలు

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలోని నిత్యాన్నదాన ట్రస్టుకు దాతలు ఆదివారం విరాళాలు అందజేశారు. చెన్నైకు చెందిన అశోక్‌కుమార్, కల్యాణి రూ.1.70 లక్షలు అందజేశారు. అలాగే బెంగళూరుకు చెందిన జయప్రకాష్‌రెడ్డి నిత్యాన్నదానానికి రూ.2 లక్షలు, గోసంరక్షణ ట్రస్టుకు రూ.2.20 లక్షలు అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, చిట్టిబాబు పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా చేసుకోండి

బంగారుపాళెం: మామిడి పంటకు బీమా చేసుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి సాగరిక ఆదివారం తెలిపారు. మామిడి పంటకు ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వర్తింపజేసిందని ఆమె అన్నారు. రైతులు ఎకరా మామిడికి పంటల బీమా పథకం కింద రూ.1,750 చెల్లించాలన్నారు. పంట నష్టం జరిగితే రైతులకు ఎకరాకు రూ.35 వేల వంతున బీమా కంపెనీలు నష్టపరిహారం చెల్లిస్తాయని వివరించారు. రైతులు ఈనెల 15వ తేదీలోపు మామిడి పంటకు బీమా ప్రీమియం చెల్లించాలన్నారు. రైతులు బ్యాంకుల ద్వారా లేదా కామన్ సర్వీస్ సెంటర్, బీమా కంపెనీ, ఇన్సూరెన్స్ ఏజెంట్ ద్వారా ప్రీమియం చెల్లించవచ్చని పేర్కొన్నారు. బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంటి పాపను రక్షించుకుందాం

కాణిపాకం: ప్రస్తుత పరిస్థితుల్లో ఫోన్‌ల వాడకం, సరైన పౌష్టికాహారం లేక కంటిపాప దెబ్బతింటోందని, వైద్యుల సూచనలు పాటించి కంటిని రక్షించుకుందామని ఈఓ పెంచల కిషోర్ అన్నారు. కాణిపాకంలోని వరసిద్ధి వినాయక దేవస్థానంలో ఆదివారం అరవింద్ ఐ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 200మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఏఈఓ రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి, సీఎఫ్ఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వంతెన... ఇంతేనా?

- కుశస్థలి నదిపై నిర్మాణానికి నోచుకోని హైలెవెల్ వంతెన
- సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న ప్రజలు
- వర్షాకాలంలో తీవ్ర ఇక్కట్లు



హైలెవల్ వంతెన నిర్మాణానికి సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు (ఫైల్)



లోతట్టు వంతెనపై పారుతున్న కుశస్థలి నది

నగరి: కుశస్థలి నదిపై హైలెవెల్ వంతెన నిర్మాణానికి నోచుకోకపోవడంతో వర్షాకాలం నీటి ప్రవాహ సమయంలో వివిధ గ్రామాల ప్రజలు జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నారు. వంతెన లేకపోవడంతో కీళపట్టు, మేళపట్టు, ముడిపల్లి, రామాపురం, నెత్తం కండ్రిగ, వీకేఆర్ పురం, తడుకుపేట గ్రామాలకు చెందినవారు పడుతున్న అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. వర్షాకాలంలో నది ఉప్పొంగితే లోతట్టు వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఈ మార్గాన్ని రెండు వైపులా మూసివేస్తారు. సాహసం చేసి ఆ మార్గంలో నడచి పోదామని ప్రయత్నించిన వారు కొట్టుకుపోవడం, వారిని ఆపై కాపాడడం లాంటి పలు సంఘటనలు అనేకం. దీంతో లోతట్టు వంతెనపై నీరు పారే సమయాల్లో సుదూర ప్రాంతంలోని మరో వంతెనపై నుంచి గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రానికి వెళ్లే బస్సులుకు కూడా ఇదే ప్రధాన మార్గం. ఆ సమయాల్లో బస్సు ప్రయాణించే మార్గాన్ని మార్చాల్సి వస్తోంది. రెండేళ్ల క్రితం ఇలా పెద్ద ఎత్తున వంతెనపై రోజుల తరబడి నీరు పారింది. ఆ సమయంలో లోతట్టు వంతెన కూడా కొట్టుకుపోయింది. దీంతో రోజుల తరబడి ఈ మార్గంలో



రాకపోకలు నిలిచిపోయాయి. అప్పటి మంత్రి ఆర్కే రోజా వెంటనే తాత్కాలిక ప్రాతిపదికన రోడ్డును నిర్మించేలా కృషి చేశారు. అప్పట్లోనే భవిష్యత్తులో ఇలాంటి సమస్య రాకూడదని హైలెవెల్ వంతెన నిర్మాణానికి నడుం బిగించారు. ముఖ్యమంత్రిని, సంబంధిత మంత్రిని, ఆర్ అండ్ బి ముఖ్య కార్యదర్శిని కలిసి సమస్యను వారి దృష్టికి తీసుకెళ్లారు. నూతనంగా హైలెవెల్ వంతెన నిర్మాణానికి ప్రయత్నాలు చేపట్టారు. దీంతో రోడ్లు భవనాల శాఖకు సంబంధించిన ఇంజినీర్లు వంతెన నిర్మించాల్సిన ఎత్తు, వెడల్పు, దూరం లాంటి కొలతలు, సర్వేలు చేసి దానికి అంచనాలు సిద్ధం చేశారు. అవసరమయ్యే నిధులు అంచనా వేయడం లాంటి ప్రక్రియలు జరిగాయి. రూ.8.4 కోట్లు నిధుల మంజూరుకు ప్రభుత్వం కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే అంతలో ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో వంతెన నిర్మాణ అంశం మరుగున పడింది. అప్పటివరకు జరిగిన ప్రక్రియ కాగితాలకే పరిమితమైంది. వంతెన అవసరాన్ని గుర్తించి ప్రస్తుత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

> **రాకపోకలకు ఇబ్బంది**
>
> 
>
> మా గ్రామంతోపాటు పలు గ్రామాలకు వెళ్లేందుకు కుశస్థలి నదిపై ఉన్న లోతట్టు వంతెనే ప్రధాన మార్గం. అయితే వర్షాలు ఎక్కువగా కురిసి కృష్ణాపురం డ్యామ్ గేట్లు తెరిచే సమయంలో నదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. ఆ సమయాల్లో ఈ మార్గంలో వెళ్లలేం. సుదూర ప్రాంతంలోని వంతెనపై నుంచే వెళ్లాల్సి ఉంటుంది. గతంలో పలువురు అధికారులు వంతెన నిర్మాణం కోసం సర్వే చేశారు. అయితే ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయాయి.
>
> – ప్రకాష్, ముడిపల్లి గ్రామం

> **చుట్టూ తిరిగి రావాల్సి వస్తోంది**
>
> 
>
> మాది నెత్తం కండ్రిగ గ్రామం. ప్రతి రోజూ లోతట్టు వంతెన ఉన్న మార్గంలోనే మా గ్రామానికి వెళుతుంటాను. వర్షాకాలం కుశస్థలి నది పొంగి ప్రవహిస్తుంటుంది. ఆ సమయాల్లో ఈ మార్గంలో రాలేం. చుట్టూ తిరిగి మరో వంతెన పైనుంచే వెళ్లాలి. నాలుగు రోజుల క్రితం కూడా ఇదే పరిస్థితి ఎదురైంది. చేపలు పట్టే ఒక వ్యక్తి కూడా కొట్టుకుపోతే పోలీసులు, స్థానిక యువకులు కాపాడారు. హైలెవెల్ వంతెన నిర్మిస్తే ఆ సమస్య ఉండదు.
>
> – కృష్ణమూర్తి, నెత్తంకండ్రిగ

హెచ్‌ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలి

– ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జిల్లా చైర్మన్ పీబీ. బాలసుబ్రమణ్యం

నగరి: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్‌ఏ పాలసీ అమలు చేయాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ పీబీ బాలసుబ్రమణ్యం డిమాండ్ చేశారు. ఆదివారం నగరి పట్టణంలోని మార్కెట్ యార్డ్ భవనంలో ఏపీ జేఏసీ అమరావతి అనుబంధంగా ఉన్న కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డివిజన్ స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నెంబర్ –7ను సవరించి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వం న్యాయం చేయాలన్నారు. స్కిల్డ్, అన్‌స్కిల్డ్ తరగతుల వేతన వ్యత్యాసాన్ని సవరించాలన్నారు. సీనియార్టీ ప్రాతిపదికన వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.జ్ఞాన శేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ వర్తింపచేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.25 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

డివిజన్‌కు నూతన కమిటీ

సమావేశంలో నగరి డివిజన్‌కు నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరి డివిజన్ నూతన కమిటీకి చైర్మన్‌గా యం.షకీలా (నగరి పురపాలక సంఘం), ప్రధాన కార్యదర్శిగా టి.మురళి(సాంఘిక సంక్షేమ శాఖ), వైస్ చైర్మన్‌గా వేలాయుధం(వెటర్నరీ విభాగం), గౌరవ అధ్యక్షుడిగా జైపాల్(మార్కెటింగ్), ప్రచార కార్యదర్శిగా డి.మస్తాన్ (మున్సిపాలిటీ విభాగం), ఆర్గనైజింగ్ సెక్రటరీగా గోపీనాథ్(వెటర్నరీ విభాగం), అధికార ప్రతినిధిగా ముని బాబు(ట్రెజరీ), జాయింట్ సెక్రెటరీగా మధుసూదన్, ప్రతాప్, ఈసీ మెంబర్స్‌గా జి.అయ్యప్ప, కె.ఖాసీం, జె.బలరాం, శ్రీనివాసులు, డి.గోపీనాథ్, ధనసింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి అవుట్‌సోర్సింగ్ కార్మికుల పాల్గొన్నారు.

బాధితులకు మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శ





జాతరపెద్ద నరసింహారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, దేవరాజులు రెడ్డిని పరామర్శిస్తున్న మాజీమంత్రి ఆర్కే రోజా

నగరి: మున్సిపల్, రూరల్ మండలంలోని పలువురిని ఆదివారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్కే రోజా పరామర్శించారు. పట్టణంలో ఇటీవల మృతి చెందిన గంగ జాతర పెద్ద నరసింహారెడ్డి కుటుంబాన్ని ఉదయం ఆమె పరామర్శించారు. నగరి పట్టణం రెడ్డివారి సందులోని ఆయన స్వగృహానికి వెళ్లి నరసింహారెడ్డి చిత్రపటానికి పుష్పాలు చల్లి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులు వీఆర్ఓ సదాశివరెడ్డి, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిరంజీవి రెడ్డి, రవిరెడ్డిలను పరామర్శించారు. అనంతరం ఇటీవల ఓపెన్‌హార్ట్ సర్జరీ చేసుకున్నా ఏకాంబరకుప్పంకు చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు ఎంఎం రాజా, ప్రమాదానికి లోనై చికిత్స పొందుతున్న రూరల్ మండలం తెరణి గ్రామానికి చెందిన మోహన్‌ను వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గుండ్రాజుకుప్పం గ్రామానికి వెళ్లిన ఆమె ఇటీవల పితృవియోగానికి గురైన పార్టీ సీనియర్ నాయకుడు దేవరాజులు రెడ్డిని పరామర్శించారు.

ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, జడ్పీటీసీ సభ్యులు గాంధీ, కౌన్సిలర్లు బీడీ భాస్కర్, గోపాల్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, బాబు, భూపాలన్, మురుగ, వైస్‌ఎంపీపీ కన్నియప్ప తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముందస్తు క్రిస్మస్ వేడుకలు



క్రిస్మస్ తాత వేషధారణలతో భజనలు చేస్తున్న క్రైస్తవులు

కార్వేటినగరం: మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని బేతేల్‌షారోన్ చర్చిలో పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ముందుస్తు క్రిస్‌మస్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ ఆశీర్వాదం మాట్లాడుతూ.. డిసెంబర్ మాసం ఏసు జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెలను పవిత్రంగా భావించి మందిరాలు , ప్రతి ఇంటిపై శిలువతో కూడిన స్టార్‌లను ఏర్పాటు చేసి ప్రభువును మహిమపరుస్తారని చెప్పారు. అనంతరం చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేపట్టారు. ఈ క్రమంలో భాగంగా క్రిస్మస్ తాత వేషంలో మార్కు మురగయ్య పలువురిని ఆకట్టుకున్నారు. అదే విధంగా గ్రామ వీధుల్లో ప్రభువు గీతాలను ఆలపిస్తూ స్టార్లతో కూడిన పతాకాలను చేపట్టి ర్యాలీ నిర్వహించారు.అనంతరం మధ్యాహ్నం చర్చి ఆవరణలో చిన్నారులతో కేక్ కట్ చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో షీబాజస్సిఖ, పాస్టర్‌బాబు, పాస్టర్ హరిబాబు, పాస్టర్ ఫాల్ విశ్వాసకులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న చర్చీలు

పాలసముద్రం : మండలంలో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని క్రైస్తవులు చర్చీలను ఆకట్టుకునేలా స్టార్‌లు ఏర్పాటు చేసి ముస్తాబు చేస్తున్నారు. మండలంలోని చర్చీలో క్రిస్మస్ పండుగ వరకు ఉదయం , సాయంత్రం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ ఆదివారం నుంచి క్రిస్మస్ వరకు తాత వేషాలతో కొంత మంది విద్యార్థులు వేస్తున్న నాటకాల ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి.



ప్రత్యేకంగా స్టార్‌లతో ముస్తాబు

ఫ్లైఓవర్‌పై వాహనాల పరుగులు

- మాజీ మంత్రి రోజా కృషి ఫలితం
- జోరుగా జాతీయ రహదారి 205 విస్తరణ పనులు



పనులు పూర్తి కావడంతో పుత్తూరు ఫ్లెఫైవర్ బ్రిడ్జిపై పరుగులు పెడుతున్న వాహనాలు



కేంద్ర మంత్రి గడ్కరీకి నివేదిక సమర్పిస్తున్న అప్పటి మంత్రి రోజా (ఫైల్)

పుత్తూరు: గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఆర్కే రోజా చేసిన కృషి ఫలితంగా నేడు పుత్తూరు–చెన్నై జాతీయ రహదారిలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై వాహనాలు పరుగులు పెడుతున్నాయి. అప్పట్లో టీడీపీ నేతల తప్పిదాలతో వడమాలపేట నుంచి పుత్తూరు మీదుగా నగరి వరకు వెళ్లే జాతీయ రహదారి పనులు ఆగిపోయినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా నగరిలోని ఓజికుప్పం, పుత్తూరు, పాదిరేడుల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు ప్రాణాలు పోగొట్టుకున్నారు. దీనిపై తీవ్రంగా స్పందించిన అప్పటి పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా, నాటి కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఢిల్లీలో రెండు పర్యాయాలు కలసి నివేదికలు సమర్పించారు. చిత్తూరు జిల్లాలోని ఎన్‌హెచ్ రోడ్లపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో చనిపోయినవారి వివరాలను అందజేశారు. అంతేకాకుండా పూర్తికాని రోడ్ల విస్తరణ పనులు, ప్రారంభమే కాని అప్రోచ్ రోడ్లపై సమగ్రంగా నివేదిక ఇచ్చారు.. దీనిపై ఈఏడాది జనవరి 22న రహదారి విస్తరణ పనులకు కేంద్రం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని రెండు జాతీయ రహదారుల్లో 81.38 కి.మీ నిడివికి రూ.1532.54 కోట్లు మంజూరు చేసి టెండర్లను ఆహ్వానించింది. ఏడాదిగా జరుగుతున్న విస్తరణ పనుల్లో భాగంగా పుత్తూరులోని ఫ్లెఫైవర్ బ్రిడ్జి పనులు పూర్తయ్యాయి. దీంతో చెన్నై–తిరుపతి మధ్య వెళ్లే వాహనాలు ఫ్లెఫైవర్ మీదుగా పరుగులు పెడుతున్నాయి. దీంతో నారాయణవనం రోడ్డు సర్కిల్ వద్ద జరిగే ప్రమాదాలను అరికట్టినట్లే. ఫ్లెఫైవర్ పూర్తి కావడంపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

> గ్రామీణ రహదారులను అద్దంలా ఆధునికీకరిస్తామని ఊదరగొట్టిన కూటమి సర్కారు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎక్కడైనా చిన్న గుంత కనిపిస్తే చాలు అక్కడ వాలిపోయి వర్షపు నీటిలో దొర్లి ఫొటోలకు పోజులిచ్చిన నేతలు.. నేడు గుంతలమయంగా మారిన గ్రామీణ రోడ్ల గురించి ఎందుకు పట్టించుకోవడం లేదని పల్లె జనం ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఆయా మండలాల్లోని గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారి వర్షాలకు కుంటలను తలపిస్తున్నాయి. వీటిపై ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగిస్తున్నారు. – వెదురుకుప్పం

వీటిని రోడ్లంటారా?

- గుంతలమయంగా గ్రామీణ రహదారులు
- కంకరతేలిన తారు రోడ్లు
- నరకం చూస్తున్న పల్లె జనం

కుంటను తలపిస్తున్న మాంబేడు వెళ్లే దారి





కుంటను తలిపిస్తున్న కానవారి ఇండ్ల రోడ్డు



కంకరతేలిన చింతలగుంట తారురోడ్డు

మండలంలోని మాంబేడు గ్రామానికి వెళ్లే తారు రోడ్డు అధ్వానంగా మారింది. రోడ్డుపై గుంతలు ఏర్పడి రాళ్లు తేలాయి. వర్షం వస్తే గుంతల్లో నీరు నిలిచి కుంటలను తలపిస్తున్నాయి. ఈ రోడ్డుపై మాంబేడు గ్రామంతో పాటు మాంబేడు ఎస్సీ కాలనీ, మాంబేడు అదిఆంధ్రవాడ, వేణుగోపాలపురం, వెంకటరెడ్డి ఊరు, చెరువులో ఇండ్లు గ్రామాలకు చెందిన ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. అదేవిధంగా నల్లవెంగనపల్లె పంచాయతీ నుంచి రెంటాలచేను, చెంచుగుడి మీదుగా తిరుపతి–దేవళంపేట ప్రధాన రహదారి వరకు గతంలో ప్రజలకు సౌకర్యంగా తారు రోడ్డు వేశారు. అది ఇప్పుడు పలు చోట్ల గుంతలు పడి కంకరతేలి దారుణంగా మారింది. కంకర తేలిన రోడ్డుపై ప్రయాణాలు సాగించలేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. వాహచోదకులు సైతం వాహనాలను నడిపేందుకు సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొంది. అల్లంవారికండ్రిగ, చింతలగుంట, చింతలగుంట ఎస్సీ కాలనీ, ఏపేరి, బాలుపల్లె, గుంతలచేను, రెంటాలచేను, చెంచుగుడి గ్రామాలకు చెందిన గ్రామస్తులు కంకర తేలిన రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే నరకయాతన పడుతున్నారు.

ఏడు గ్రామాల ప్రజలకు ఇదే దారి

తిరుపతి–పెనుమూరు ప్రధాన రహదారి నుంచి అగ్గిచేనుపల్లె మీదుగా మొరవ గ్రామం వరకు ఉన్న తారు రోడ్డు రూపురేఖలు కోల్పోయింది. దీంతో రాకపోకలకు సంకటంగా మారింది. ఈ రోడ్డు పై సుమారు ఏడు గ్రామాల ప్రజలు ప్రయాణాలు సాగిస్తున్నారు. రోడ్డు మరమ్మతులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు.

వర్షం వస్తే వణుకే..

వర్షం వస్తే చాలు రోడ్డు కోసుకుపోయి కుంటలను తలపిస్తున్న మట్టి రోడ్లపై అడుగుపెట్టలేక కానవారిఇండ్లు, కలిమిచేను, వేపేరి, అల్లంవారికండ్రిగ ప్రజలు అవస్థలు పడుతున్నారు. చినుకు పడితే రోడ్లు ఛిద్రమవుతున్నాయని అడుగు తీసి అడుగు వేయలేకున్నామని స్థానికులు వాపోతున్నారు. వర్షాలకు రోడ్లు బురదమయం కావడంతో ఎక్కడ జారిపడతామోనన్న ఆందోళన చెందుతున్నారు. కానవారి ఇండ్లకు వెళ్లే రోడ్డు ఎత్తుగా ఉండడంతో వర్షాలకి రోడ్డు కోతకు గురై రోడ్డు పై ఉన్నమట్టి కొట్టుకుపోయి వాగును తలపిస్తోంది. ద్విచక్రవాహనాలు సైతం వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్ల ఆధునికీకరణ గురించి ప్రభుత్వం పట్టించుకోలేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

హామీలకే పరిమితం

ప్రజాప్రతినిధులు అది చేస్తాం.. ఇది చేసేస్తామంటూ ప్రజలను మభ్యపెట్టే మాటలు మాట్లాడుతున్నారే తప్ప క్షేత్ర స్థాయిలో మాత్రం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు కేవలం హామీలకే పరిమితం అవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్ల మరమ్మతులకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శ్రీకావేరిరాజుపురంలో వరినారు నాటుతున్న మహిళలు



వరి వడిగా..

- పొలం పనుల్లో బిజీగా రైతన్నలు
- వేధిస్తున్న కూలీల కొరత



ట్రాక్టర్‌తో దుక్కులు చేసి చదును చేస్తున్న రైతులు



వరి నారు తీస్తున్న కూలీలు

పాలసముద్రం: మండలంలో తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు రైతులు రబీ సాగుకు రెండో విడత దుక్కులు చేసి వరి, వేరుశనగ పంటల సాగులో నిమగ్నమయ్యారు. మండలంలో సాగు చేయాల్సిన విస్తీర్ణం 1050 హెక్టార్లు అందులో ప్రస్తుతం బోరు బావుల కింద ఉన్న రైతులు సుమారు 889 హెక్టార్ల భూమిలో వరి , మరికొంత మంది రైతులు 95 హెక్టార్లలో వేరుశనగ పంటలు సాగు చేస్తున్నారు. అధికంగా వరిపైరు సాగు చేస్తుండడంతో కూలీలు దొరక్క తమిళనాడు రాష్ట్ర నుంచి కూడా వరినాట్లు వేయడానికి పిలిపిస్తున్నారు. స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. వేరుశనగ, వరి పంటల సాగు నెలాఖరులోపు చేసుకుంటే మంచి అదునులో సాగై అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.



క్రిష్ణజమ్మపురం వేరుశనగ విత్తనం వేస్తున్న రైతన్నలు